# మంత్రిగా! మజాకా!

-ఆర్.శ్యామల

శ్రీరాముని పట్టాభిషేకానికి అయోధ్య అంతా సంబరంగా అలంకరించినట్లు, ఆ చిన్న వూరంతా మంత్రిగారి రాకకోసం పదిరోజులు ముందే అలంకరణ ప్రారంభించింది. రోడ్డేలేని ఆ ఊరికి హడావుడిగా రోడ్డు ఏర్పడిపోయింది. చెత్తాచెదారం కన్పించనీయకుండా శుభ్రం చేసారు.

ఆ వూరి పర్యటనలో మంత్రిగారికి ఎక్కడా కోపం రాకూడదని అనేక జిమ్మిక్కులు చేస్తున్నారు. అక్కడ పనులన్నింటినీ మంత్రిగారి పి.ఏ సుబ్బారావు అజమాయిషీ చేస్తున్నాడు.

వూరిలోకి మంత్రిగారు వచ్చేరోజు ఆయన ప్రోగ్రాం ఏమిటేమిటో అంతా లిస్ట్ రాసుకున్నాడు. ఉదయం పదిగంటలకి వూరిలోని వారినందరినీ సమావేశానికి రమ్మన్నాడు. కానీ ఎవరూ రాలేదు. కొంతమంది పిల్లలు చుట్టూచేరి సుబ్బారావును వింతగా చూస్తున్నారు. అసలే ఎండ వేడికి చిరాకుగా ఉన్న సుబ్బారావుకి వాళ్లలా చూడడం మరింత మంట రేపింది.

"ఏమర్రా పిల్లలూ! స్కూల్‌కి వెళ్లలేదా" ఏదో ఒకటి మాట్లాడదామని అడిగాడు.

"లేదు సారూ... మావు స్కూల్ ఎగ్గొట్టినాం"

"అదేంటీ.." ఆశ్చర్యంగా అడిగాడు.

"ఉదయం హాజరు వేయించుకుని వచ్చేత్తాం. లేకపోతే ఆ స్కూల్‌లో కూకోబెట్టి సదిత్తారు. మాకు సానా పన్లున్నాయి సారూ. మజ్జాన్నం బువ్వకి మళ్ళా స్కూల్‌కి ఎళతాం" అన్నాడొకడు.

'ఓరి నాయనో... ఇలా అయితే ఎలా? ఆ మంత్రి మొదట స్కూల్‌కే కదా వచ్చేది. వూర్లో వున్న ఒక్కొగానొక్క స్కూల్. అయినా ఈ వూర్లోకి రావాలని ఆ మంత్రికి బుద్ధెందుకు పుట్టిందో తెలియదు' మనసులోనే తిట్టుకున్నాడు సుబ్బారావు.

"పిల్లలూ! మీ హెడ్‌మాస్టార్ని అర్జంటుగా నేను ఇక్కడికి రమ్మన్నానని పిలవండి" అని పిల్లలకి చెప్పాడు.

వెంటనే ఇద్దరు పిల్లలు పోటీపడి మరీ స్కూల్ వైపు పరుగుతీసారు.

అంతలో ప్రెసిడెంట్, ఇంకో నలుగురిని వెంట బెట్టుకుని వచ్చాడు.

"క్షమించండి సార్. వూళ్లో అందరూ పొలం పన్లకి వెళ్లిపోయారు. వీళ్లని కూడగట్టుకుని వచ్చేసరికి కాస్త ఆలస్యమైంది" వస్తూనే సంజాయిషీ చెప్పుకున్నాడు ప్రెసిడెంట్ జగన్నాథం.

"సరిగ్గా వారం రోజుల తరువాత మంత్రిగారొస్తారు. ఆయన ఇక్కడ ఏయే కార్యక్రమాల్లో పాల్గొంటారో చెబుతాను వినండి"

"అదిగో మాటల్లోనే హెడ్‌మాస్టారుగారు కూడా వచ్చేసారు" అన్నాడు ప్రెసిడెంట్.

ఒకరినొకరి పరిచయ వాక్యాలు అయ్యాక గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టాడు సుబ్బారావు.

"ఆరోజు ఉదయం తొమ్మిదిగంటలకు మంత్రిగారు స్కూల్‌కి వస్తారు. పిల్లలంతా స్వాగత గీతంతో ఆహ్వానించాలి. కొంతమంది పిల్లలతో మాట్లాడతారు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతారు. ఒక గంటవరకు స్కూల్‌లో వుంటారు" కాసేపాగి మళ్లీ అందుకున్నాడు.

"ఆరోజు పిల్లలని శుభ్రమైన బట్టలు వేసుకుని రమ్మనండి. మరి మేష్టారూ! మీరు స్కూల్‌ని చాలా నీట్‌గా ఉంచాలి. సున్నం, రంగులు వేయించండి. జెండాలు కట్టి అందంగా డెకరేషన్ చేయండి. పిల్లలు ఆయన దగ్గర నమ్రతగా ఉండాలి. ఆయన అడిగినవాటికి ఎలా జవాబులు చెప్పాలో పిల్లలకు ఈ నాలుగురోజులూ నేర్పించండి."

"సార్! ఒక డౌట్. మంత్రిగారు ఏం అడుగుతారో మాకు తెలియదుకదండీ. ఏం నేర్పించమంటారు?" వెర్రిముఖం వేసుకుని అడిగాడు హెడ్‌మాస్టారు.

"ఏముందీ... ఏం పేరు, ఏం చదువుతున్నావు, పెద్దయ్యాక ఏమవుతావు... వగైరా వగైరా ప్రశ్నలే అడుగుతారు" అని పైకి అన్నాడు. మనసులో మాత్రం 'అంతకుమించి ఏం తెలుసునని' అనుకున్నాడు.

"తరువాత పదిగంటలకి ఎవరిదైనా మంచి ఆవు వుంటే దాన్ని శుభ్రంగా ఉంచండి. మంత్రిగారు ఆ ఆవు పాలు పితుకుతారు"

"అదెందుకండీ...?" విస్మయంగా అడిగాడు ప్రెసిడెంట్.

"ఆయనా రైతుబిడ్డే అని నిరూపించుకునేందుకు... అందుకే మంచి ఆవుని ఏర్పాటు చేయాలి. మీలో ఎవ్వరైనా మంత్రిగారు తీసిన పాలను కొనాలి."

"అదెందుకు... మా అందరి దగ్గర పశువులున్నాయికదా. మరి పాలు ఎందుకు కొనాలి?" అన్నాడొకడు.

"అయిన సారూ... పాలు కొనుక్కున్నా, ఆవు గలవాడికి డబ్బులు ఇవ్వాలిగదా. మంతిరిగారెందుకు ఇవ్వాలి" తన డౌట్‌ని ముందుంచాడు.

"మీరు అలా మాట్లాడకూడదు. ఆయన ఇంత దూరం వస్తున్నారు. ఆయన శ్రమకి తగిన ఫలితం ఇవ్వాలికదా. ఎవరు కొంటారు?" ఆసక్తిగా అడిగాడు సుబ్బారావు.

"నేను కొంటాను. లీటరు ఇరవయ్యే కదా" సంతోషంగా అన్నాడు ప్రెసిడెంట్.

"బావుందీ వరస. ఆయనేం మీ పాలేరు కాదు. ఇరవై ఇచ్చి అవమానిస్తారా? లీటరుకి కనీసం వెయ్యి రూపాయలు ఇవ్వాలి"

"ఆ...వెయ్యే..." ప్రెసిడెంట్‌తోసహా అందరూ నోరెళ్లబెట్టారు.

"మరి రేపు పేపర్లో మీ ఫోటో పడుతుంది.

పెద్ద పెద్ద అక్షరాలతో రాస్తారు. అందుకే మీరే కొనాలి'' ఆర్డరేసాడు సుబ్బారావు.

అయిష్టంగా తలాడించాడు ప్రెసిడెంట్ జగన్నాధం. "ఆ.. దాని తరువాత పొలంలో నాగలితో దున్ని నాట్లు వేస్తారు.''


"అదేంటండీ... ఉడుపులు ఎప్పుడో అయిపోయినాయికదా. ఇప్పుడు ఇంకేటి నాట్లు ఏస్తారు'' కిసుక్కున నవ్వాడొకడు.

"అబ్బా... తలచుకుంటే మార్గముంటుందయ్యా... ఎక్కడో ఒక మడి ఖాళీగా వుంటుంది కదా. అది శుభ్రం చేసి నీరు బాగా పెట్టి మీరే దున్ని ఉంచండి. ఆయన నాగలిని అలా అలా రెండుసార్లు తిప్పుతారు. మంచి ఎద్దులను ఏర్పాటు చేయండి. వాటిని కడిగి నీట్‌గా ఉంచండి. వాటి కొమ్ములకి రంగులేసి మెళ్లో గంటలు కట్టి డెకరేట్ చేయండి'' తన బ్యాగ్‌లోని బాటిల్‌లోని నీళ్లు తీసి తాగాడు.

"నారులేదు కదండీ'' సందేహం వెలిబుచ్చాడు ప్రెసిడెంట్.

"నారులేకపోతే విత్తనాలు జల్లుతారు. అంతే. తరువాత మీ ఊళ్లో ఆడవాళ్లు ఏర్పాటుచేసిన వస్తు ప్రదర్శనని చూస్తారు.''

"మేము అటువంటిది ఏదీ చేయలేదు'' అయోమయంగా చూసాడు ప్రెసిడెంట్.



"చేయలేదు కాదు చెయ్యాలి. మరి మంత్రిగారు వస్తున్న శుభసందర్భాన ఇలాంటివి ఏర్పాటుచేయాలి. ఏవో ఆడవాళ్లు పన్లు ఉంటాయికదా. జనపనారతో బుట్టలు, బ్యాగులు అల్లడం, చీరలమీద పువ్వులు ఎంబ్రాయిడరీ చేయడం, బొమ్మలు చేయడం అలాంటివి..."

"అయ్యో సారూ... మా ఆడోళ్లకి అంత తీరిక ఎక్కడుంటుంది? ఉదయం పొలంకెళితే మళ్ల పొద్దుగూగకకానీ ఇంటికి రారు. ఇంట్లో ముసలి, ముతక ఉన్నారంటే ఆళ్లు వంట వార్పు చూసుకుంటారు. ఎవరికీ ఇటువంటి పన్లు రావు సారు" తమ గోడు వెళ్లగక్కాడొకడు.

"పోన్లే అవన్నీ మేం అరేంజ్ చేస్తాం. కనీసం మీ ఆడాళ్లు వంటలయినా చేస్తారుకదా. పిండివంటలు అవీ వడ్డించండి. ఇళ్లన్నీ శుభ్రంగా ఉండాలి."


"మంత్రిగారు ఆడవాళ్లు ఏర్పాటుచేసిన స్టాల్స్ చూసి తరువాత వాళ్ల కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటారు. అందుకు ఎవ్వరైనా ఒక మంచి ఆవిడని... అంటే బాగా మాట్లాడే ఆవిడని పెట్టండి. తరువాత ఆయన ఒక రైతు ఇంట్లో...అదీ పూరిల్లు అయితే మంచిది. ఆ ఇంట్లో భోజనంచేసి వెళ్లిపోతారు" చెప్పడం ఆపాడు సుబ్బారావు.



## ఒక్కరోజు పెళ్లి

అమ్‌స్టర్‌డామ్‌లో సైన్స్ మ్యూజియం దగ్గర ఇటీవల చిల్డ్రన్ వెడ్డింగ్ డే జరిగిందిట. ఆనాడు పొద్దున్న పెళ్లి చేసుకున్న పిల్లల జంటలు సూర్యాస్తమయానికి విడిపోతాయిట. ఒక్కరోజుకని పెళ్లి చేసుకున్న జాస్పెర్, లెవీలను చిత్రంలో చూడవచ్చు.

-తటవర్తి




'హమ్మయ్య' అనుకున్నాడు ప్రెసిడెంట్. మొత్తమంతా మననం చేసుకున్నాడు.

"అప్పన్నగాడి ఆవు బావుంటుంది.అప్పన్నకి చెప్పి ఆ రోజు ఆవుకి పాలు పిండకుండా శుభ్రంగా ఉంచమని చెప్పాలి. భోజనం బావమరిది నర్సింహులు ఇంట్లో ఏర్పాటుచేద్దాం. అచ్చయమ్మ మడి ఒకడి ఖాళీగా ఉంది. దాన్ని దున్ని రెడీ చేద్దాం.ఇంకా ఆడవాళ్ల చేత వంటలు చేయించాలి. బాగా మాట్లాడిన ఆవిడ కావాలన్నారు ఎవరిని పెడదాం?" అని బుర్ర గోక్కున్నాడు. అందరూ కలసి తర్జనభర్జనలు పడిన మీదట మంత్రిగారితో మాట్లాడే అవకాశం గౌరమ్మకు ఇచ్చారు. గౌరమ్మ తెలివైంది. ఏడవ తరగతి వరకు చదివింది. పోయినేడే పెళ్లయింది వూర్లోవున్న మేనమామతో. మన కష్టాలన్నీ గౌరమ్మ అయితే బాగా చెప్పగలదని అందరూ నిర్ణయించారు.

"స్కూలు ఇసయం నువ్వే చూసుకో మాస్టారూ" అంటూ లేవబోయాడు ప్రెసిడెంట్. కంగారుపడిపోయాడు హెడ్‌మాస్టారు.

"అదేంటి జగన్నాధంగారూ. మీకు తెలుసుకదా. పిల్లలు సరిగ్గా బడికి రావడంలేదు. మీరు చెప్పండి ఈ నాలుగురోజులూ అయినా చక్కగా స్కూల్‌కి పంపించమనండి" ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"సరేనయ్యా... ఇదిగో అందరూ ఇనండి. రేపటినుండి పిల్లకాయలందరినీ స్కూల్‌కి పంపాలి. ఏమర్రా... పిల్లలూ మీరందరూ మాస్టారు చెప్పినట్లుగా వినాలి. అర్ధమయిందా" అక్కడ చేరిన పిల్లలని ఉద్దేశించి అన్నాడు ప్రెసిడెంట్ జగన్నాధం. మంత్రి పిల్లలని ఏం అడుగుతాడోనని పుట్టెడు దిగులుతో అక్కడ నుండి వెళ్లిపోయాడు హెడ్‌మాస్టారు. మంత్రిగారితో మాట్లాడే ఛాన్స్ తనకే వచ్చిందని తెలిసి గౌరమ్మ తెగ సంబరపడిపోయింది.

★★★

ఆ రోజు రానే వచ్చింది. మాస్టారు స్కూల్‌ని శుభ్రంగా ఉంచడానికి చాలా కష్టపడ్డారు. పిల్లలు చదువుకన్నా పనిలో బాగా సహాయం చేసారు.

"మీరు మంత్రిగారి దగ్గర బుద్ధిగా ఉంటే పేపర్లో మీ ఫోటో, మన స్కూల్ ఫోటో పడుతుంది. టీవీలో కనిపిస్తాము" అని చెప్పాడు.

అప్పన్న ఆవుని శుభ్రంగా కడిగాడు. పశువుల పాకని ముందు రోజే శుభ్రం చేసాడు. ఆవు పాలు పిండకుండా పెయ్యిని కొంతసేపు త్రాగనిచ్చి దాన్ని దూరంగా కట్టేసాడు. అచ్చయమ్మ మడిని దున్నించి నీళ్లు పెట్టి విత్తనాలతో రెడీగా ఉంచింది. ఆడవాళ్లు అరిసెలు, బూరెలు, గారెలు, జంతికలు పోటీపడి వండి తెచ్చారు. సుబ్బారావే ఏవేవో కుట్లు, అల్లికల వస్తువులు తెచ్చి స్టాల్స్ అరేంజ్ చేసాడు. గౌరమ్మ ఉదయం లేచిన దగ్గర నుంచి హడావుడి పడిపోతోంది. నాలుగుసార్లు సబ్బుతో స్నానం చేసింది. ఎరుపు, ఆకుపచ్చ గళ్లచీర కట్టుకుంది. పక్కింటామె హారం అడిగి వేసుకుంది.

ఉదయం ఎనిమిది గంటలకే న్యూస్ ఛానళ్లవాళ్లు, ఫోటోగ్రాఫర్లు వచ్చేసారు. ఊరంతా జాతరలా వుంది. ఛానళ్లవాళ్లు కనిపించినవాడినల్లా పనికిమాలిన ఇంటర్వ్యూలు చేసేస్తున్నారు. తొమ్మిదయింది, తొమ్మిదిన్నర అయింది. మంత్రిగారు ఇంకా రాలేదు. అప్పన్న ఆవు బాధతో బాగా అరుస్తోంది. దానికి ఉదయాన్నే పాలు ఇవ్వడం అలవాటు. అప్పన్న దాన్ని అనునయిస్తున్నాడు. పదయింది. పిల్లలు స్కూల్లో మంత్రిగారి రాకకోసం ఎదురు చూస్తున్నారు. అప్పటికి నాలుగైదుసార్లు వందేమాతరం, జణగణమణ పాడించారు వాళ్లచేత హెడ్మాస్టరు. పిల్లల్లో ఓపిక నశించిపోతోంది.

చల్దిన్నం తినేసి వస్తానని ఒకరు, ఒకటికని, రెండుకని నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్కరే జారిపోయారు. గౌరమ్మ ఉండబట్టలేక ఒక టీవీ ఛానల్వాళ్లతో 'ఈ చీర బాగుందికదా, టీవీలో బాగా కనిపిస్తుందా?' అని అడిగింది.

'మీరేనా మంత్రిగారితో మాట్లాడేది?' అని ఆమె వివరాలు సేకరించి "చీర బాగుందికానీ మంత్రిగారిని డామినేట్ చేస్తుంది. ఏదైనా లైట్ కలర్ కట్టుకురండి'' అన్నారు. వెంటనే ఇంటికి పరుగెత్తుకువెళ్లి పెట్లోని అన్ని బట్టలు కెలికి వంకాయ రంగు చీర కట్టుకుని వచ్చింది.

"ఇప్పుడు బాగుంది'' అన్నారు ఛానల్ వాళ్లు. తృప్తిపడింది గౌరమ్మ.

పదిన్నర అయింది. దూరంగా దుమ్ము రేపుకుంటూ, సైరన్ మోగించుకుంటూ కార్లు వచ్చేసాయి. అంతే... అందరూ ఎలర్టు అయిపోయారు. స్కూల్లో హెడ్మాస్టారు చెమట్లు తుడుచుకున్నాడు. బయటకు వెళ్లిన పిల్లలు మళ్లీ గప్‌చిప్‌గా వాళ్ల ప్లేస్‌లోకి వచ్చి కూర్చున్నారు.

మంత్రి స్కూల్‌లోకి ఎంటరయ్యాడు. పిల్లలు వందేమాతరం పాడారు. స్కూల్ కాంపౌండ్‌లో పిల్లలు తవ్వి ఉంచిన గోతిలో రెండు మొక్కలు నాటాడు. తర్వాత పిల్లలని బాగా చదువుకోవాలని పదినిముషాలు మాట్లాడి వెళ్లిపోయాడు. మాస్టారు 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు పిల్లల్ని ఏం అడగలేదు అని. కానీ పిల్లలకి బోలెడు నిరాశ కలిగింది.

సుబ్బారావు దారి చూపగా అప్పన్న పాకవైపు కదిలారు మంత్రి. అప్పటికే పాకలో పేడ వాసన పోవడానికి రూమ్ స్ప్రే చేసారు. ఆవుకి చాలా అనీజీగా ఉంది. మంత్రిగారి కోసం ఆవు దగ్గర ముక్కలిపీట వేసారు. మంత్రిగారు దానిమీద కూర్చుని ఆవు పొదుగుని నీళ్లతో కడిగాడు. ఒక్కసారిగా కెమెరాలు క్లిక్‌మనిపించాయి. స్టీలు బిందెలలో పాలు పితికాడు. లీటరు పాలు ఉంటాయి. ప్రెసిడెంట్ జగన్నాథం వెయ్యిరూపాయలు పెట్టి మంత్రిగారి దగ్గర ఆ పాలు కొన్నాడు. మంత్రికి వెయ్యిరూపాయల నోటు అందించాడు. కెమెరాలు క్లిక్‌మన్నాయి. వెయ్యి వదిలినందుకు బాధగా ఉన్నా రేపు తన ఫోటో పేపర్లో, టీవీలో వస్తుంది అని తృప్తిపడ్డాడు.

'సొమ్ము ఒకడిది, సోకు ఒకడిది అంటే ఇదేనేమో. ఆవు నాది, పాలు నావి, కానీ డబ్బు మాత్రం మంత్రిగారికి' మనసులోనే అనుకున్నాడు అప్పన్న.

తరువాత మంత్రి పొలంవైపు కదిలాడు. ప్యాంటు మోకాలివరకు మడిచి రెడీ చేసిన మడిలో మళ్లా నాగలితో అటూ ఇటూ దున్నించాడు. తర్వాత విత్తనాలు చల్లాడు. ఫోటోగ్రాఫర్లకు ఎన్నో ఫోజులిచ్చాడు.

ఆడవాళ్లు ఏర్పాటుచేసిన స్టాల్స్ చూసాడు. స్టాల్స్ దగ్గర వాళ్లతో మట్లాడుతూ అవి ఎలా చేసారో అడుగుతూ ఫోటోగ్రాఫర్లకు పని కల్పించాడు. గౌరమ్మని ఒకసారి కింద నుండి మీదవరకు పరికించి "ఏమైనా సమస్యలుంటే చెప్పమ్మా'' అని అడిగారు.

అడిగిందే తడవుగా "సార్ మాకు నీటికి చాలా ఇబ్బంది పడుతున్నాం. వూరంతటికీ ఒకటే నుయ్యి. దూరం నుంచి తెచ్చుకుంటాము నీళ్లు. వేసవి కాలం ఇంకా చాలా ఇబ్బంది...''

"సరే... ఈ ఊర్లో ఇంటింటికీ కుళాయి వచ్చేట్లు నేను చేస్తాను'' అని ఇంక గౌరమ్మని మాట్లాడే అవకాశమివ్వకుండా నర్సింహులు ఇంటికి భోజనానికి వెళ్లాడు.

నర్సింహులు భార్య పులిహోర, నాలుగైదు రకాల వంటకాలు చేసింది. కానీ సుబ్బారావు వచ్చి "ఇవి మంత్రిగారు తినరు'' అన్నాడు.

"అదేమిటి బాబుగారూ... మీరేటి సెప్పలేదు'' అంది నర్సింహులు భార్య.

"నేను తెప్పించాను'' అని తన వెంట తెచ్చిన హాట్‌పేక్‌లోని వంటలన్నీ అక్కడ సర్దించాడు. కింద కూర్చోవడానికి మంచి బెడ్‌షీట్ వాళ్లు తెచ్చుకున్నదే. హాట్‌పేక్‌లోని వంటకాలన్నీ అక్కడ సర్దించాడు.

లంచ్ ముగిసాక అందరికి చెయ్యూపి ఎన్నడూ నెరవేరని హామీలు వెదజల్లి మంత్రిగారు వెళ్లిపోయారు. అందరూ మంత్రిగారు వెళ్లాక పిచ్చాపాటి మాట్లాడుకుంటూ వాళ్ల వాళ్ల ఇళ్లకు వెళ్లిపోయారు.

ప్రెసిడెంటు జగన్నాథం ఇంటికి వస్తూ "అసలు మంత్రిగారు ఎందుకొచ్చినట్లు...'' మనసులో అనుకున్నాడు. సడెన్‌గా పాలు గుర్తుకువచ్చాయి. "ఏమేవ్... పాలు వేడి చేసావా?'' అడిగాడు ఆత్రుతగా భార్యని.

"లేదు మర్చిపోయాను. అందరం మంతిరిగారి ఎనగాలే తిరిగామా! వేడి చేస్తా ఉండు'' అని లోపలకు వెళ్లినామె కొంతసేపటికి అరిచింది గట్టిగా "ఏమయ్యో! పాలు విరిగిపోయాయి...''

ఏడుపొక్కటే తక్కువ జగన్నాధానికి.

★



## ఎదురుచూపులు!

ప్రస్తుతం మీరా జాస్మిన్‌కి మంచి రోజులు కావివి అంటున్నారు ఆమె సన్నిహితులు. అనధికారికంగా మలయాళ సినిమా రంగంలో బ్యాన్‌లో వున్న మీరాకి తమిళంలో కూడా అవకాశాలు వచ్చినట్లే వచ్చి చేజారిపోతున్నాయి. తాజాగా ప్రముఖ దర్శకుడు నిర్మాతగా ఓ తమిళ చిత్రంలో వచ్చిన చాన్స్ కాస్తా చేజారిపోయిందిట. ఇందుకు కారణం ఆ చిత్రం హీరో నందాకి మీరా తీరు నచ్చకపోవడమే అని సినీజనాలు చెప్పుకుంటున్నారు. అలాగే తెలుగులో కూడా ఏమంత చెప్పుకోదగిన అవకాశాలు ప్రస్తుతం లేవు. కలిసొచ్చే కాలం కోసం ఎదురుచూస్తోంది మీరా జాస్మిన్.

